క్లుప్తంగా

'పెన్షనర్స్ డే'ను విజయవంతం చేయండి

కోస్గి: స్థానిక జాంగ్ర కమ్యూనిటీహాల్‌లో ఈ నెల 17న జాతీయ పెన్షనర్ల దినాన్ని పురస్కరించుకొని ఏర్పాటు చేస్తున్న 'పెన్షర్స్ డే' ను విజయవంతం చేయాలని ఆ సంఘం మండల అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు రఘునాథ్‌రెడ్డి, మల్లికార్జున్ ఒక సంయుక్త ప్రకటనలో పేర్కొన్నారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా కోస్గి మున్సిపల్ చైర్‌పర్సన్, జిల్లా గ్రంథాలయ చైర్మన్ ముఖ్య అతిథులుగా హాజరవుతున్నారన్నారు. ఇందులో భాగంగా సీనియర్ పెన్షనర్లను సన్మానించడంతోపాటు బ్యాంకు అధికారులు, ఎస్‌టీఓలతో పెన్షనర్ల సందేహాలకు సమాధానాలతోపాటు పలు కార్యక్రమాలు ఉంటాయని, అధిక సంఖ్యలో పెన్షనర్లు హాజరై కార్యక్రమాన్ని విజయవంతం చేయాలన్నారు.

విద్యార్థులకు అభినందన



ధన్వాడ: ఈ నెల 13నుంచి 15వరకు ఉమ్మడి వరంగల్ జిల్లా నెల్లికుదురులో జరిగిన 68వ రాష్ట్రస్థాయి పాఠశాల క్రీడా సమైఖ్య నెట్‌బాల్ అండర్ 19బాల, బాలికల పోటీలలో ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లా బాలుర జట్టు తరుపున పాల్గొన్న స్థానిక కొండాపూర్ గిరిజన గురుకులంలో చదువుతున్న శ్రీను, గోపి, గణేష్, కిషన్, శివకుమార్, సత్తి, నవీన్ ప్రతిభ కనబరిచి ఉమ్మడి మహబూబ్‌నగర్ జట్టు రన్నర్‌ఆఫ్ మూడవ బహుమతి బ్రాంచ్ మెడల్ సాధించారని ప్రిన్సిపాల్ రాజారాం, పీడీ డా. రామ్మోహన్‌గౌడ్ తెలిపారు. అనంతరం విద్యార్థులను ఉపాధ్యాయులు అభినందనలు తెలిపారు.

ప్రమాదకరంగా డ్రెయినేజీ



మాగనూర్: మండల కేంద్రంలోని హెచ్‌ఎచ్–167రహదారికి ఇరువైపులా నూతనంగా నిర్మించిన డ్రెయినేజీ అస్తవ్యస్తంగా తయారైందని గ్రామస్తులు ఆరోపిస్తున్నారు. ముఖ్యంగా కొన్నిచోట్ల మ్యాన్‌హోల్స్ విరిగిపడి ప్రమాదకరంగా ఉన్నాయంటున్నారు. మారుతి ఆస్పత్రి సమీపంలో కొన్నిరోజులుగా మ్యాన్‌హోల్ విరిగిపడిపోయి ఇళ్లకు వెళ్లేవారికి ఇబ్బందిగా మారిందని వాపోతున్నారు. డ్రెయినేజీలో మట్టి ఉండటంతో మురుగునీరు ఎటు వెళ్లకపోవడంతో ఇళ్లలోకి దుర్వాసన వస్తుందని, ఇప్పటికైనా అధికారులు స్పందించి డ్రెయినేజీ వ్యవస్థను సరిచేయాలని గ్రామస్తులు కోరుతున్నారు.

వంతెన లేక అవస్థలు



మాగనూర్: మండల పరిధిలోని గజ్జరందొడ్డి పెద్దవాగుపై వంతెన లేకపోవడంతో వాహనదారులు ఇబ్బందులు పడుతున్నారు. ముఖ్యంగా ఈ మార్గం నుంచి మక్తల్ పట్టణానికి కొల్పూర్, మందిపల్లి, గజ్జరందొడ్డి గ్రామాల ప్రజలు నిత్యం పదుల సంఖ్యలో ప్రయాణం సాగిస్తుంటారు. ప్రజల అవసరాలను దృష్టిలో ఉంచుకుని త్వరగతిన వంతెన నిర్మించాలని ఆయా గ్రామాల ప్రజలు కోరుతున్నారు.

డంపింగ్‌యార్డు నిత్యం పొగ

- దుర్వాసనతో ప్రజలకు ఇబ్బందులు

అమరచింత: పట్టణంలోని కొత్తతండా సమీపంలో పాడుబడిన బావిలో డంపింగ్ యార్డు పేరిట చెత్తచెదారం వేస్తూ తగుల బెడుతున్నారు. దీంతో నిత్యం దుర్వాసనతో కూడిన పొగ వల్ల శ్రీకృష్ణనగర్ కాలనీ వాసులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. గతంలో డంపింగ్ యాడ్‌ను విద్యుత్ సబ్‌స్టేషన్ సమీపంలో ఏర్పాటు చేశారు. ప్రస్తుతం అక్కడి నుంచి కొత్త తండా సమీపంలోని పాడుబావుల్లో చెత్త వేస్తున్నారు. చెత్తను తగుల బెట్టడంతో మద్దూరు రహదారిపై చిన్నచింతకుంటకు వెళ్తున్న ప్రయాణికులతో పాటు వాహనదారులు తీవ్ర ఇబ్బందులకు గురౌతున్నారు. ఇప్పటికైనా మున్సిపల్ అధికారులు స్పందించి మస్తీపురం గ్రామ శివారులో ఏర్పాటు చేసిన డంపింగ్ యాడ్‌కు పట్టణంలో సేకరించిన చెత్తను తరలించాలని కోరుతున్నారు.



వరిసాగుకు సన్నద్ధం

- పెరిగిన భూగర్భ జలాలు
- యాసంగిలో సాగుకు సిద్ధం
- పనుల్లో నిమగ్నమైన రైతులు



మండలంలో సాగు పనుల్లో రైతులు



మాగనూర్‌లో వరి నాట్లు వేస్తున్న కూలీలు

మాగనూర్: వానాకాలంలో సాగుచేసిన పత్తి, వరి పంటలు పూర్తి కావడంతో రైతులు యాసంగిలో వరి సాగుకు సిద్ధమవుతున్నారు. ఈ సంవత్సరం వర్షాలు సమృద్ధిగా కురవడంతో భూగర్భజలాలు పెరిగాయి. వరి పంటకు నీళ్లు పుష్కలంగా అందుతాయని రైతులు అంటున్నారు. నీళ్లు సమృద్ధిగా ఉండటంతో ఎక్కువగా వరిసాగు చేయడానికి నారుమళ్లు సిద్ధం చేస్తున్నారు.

70 శాతం వరి..

మండలంలో ప్రధానమైన సంగంబండ బ్యాలెన్సింగ్ రిజర్వాయర్ ఉండటంతో గ్రామాల్లో చెరువులు, కుంటలు నీటితో నిండాయి. రిజర్వాయర్‌లో నీళ్లు పుష్కలంగా ఉండటంతో ఇప్పటికే కుడి, ఎడమ లో లెవల్, హైలెవల్ కెనాల్‌కు నీరు వస్తున్నాయి. దీంతో సాగునీరు డోకా ఉండదని రైతులు వరి సాగుకు మొగ్గు చూపుతున్నారు. ఇప్పటికే 70శాతం మంది రైతులు సాగు పనుల్లో నిమగ్నమయ్యారు.

29,500 ఎకరాల సాగు..

మండలంలోని 32వేల భూమి ఉండగా.. 29500 ఎకరాల భూమి సాగుకు అనుకూలంగా ఉంది. ఈ వానకాలంలో 12800 ఎకరాల్లో వరిసాగు కాగా, యాసంగిలో 15414 ఎకరాలు సాగు చేయడానికి ప్రణాళిక రూపొందించినట్లు అధికారుల రికార్డుల్లో ఉంది. అలాగే 383 ఎకరాల్లో మిర్చి, పత్తి, వేరుశనగ వంటి పంటలు సాగు చేయనున్నట్లు అధికారులు వెల్లడించారు.

పెరిగిన భూగర్భ జలాలు..

వ్యవసాయ అధికారులు ముందస్తుగా గ్రామాల్లో యాసంగి సాగుపై అవగాహన సదస్సులు నిర్వహించారు. ఈ సంవత్సరం భూగర్భ జలాలు పెరడగం, నిరంత విద్యుత్ సరఫరా ఉంటుందనే ధీమాతో వరి సాగు చేయడానికి సన్నద్ధమవుతున్నారని పలువురు రైతులు చెబుతున్నారు.

అవగాహన కల్పిస్తున్నాం..



గ్రామాల్లో రైతులకు పంటల సాగుపై అవగాహన కల్పిస్తున్నాం. వరికి ప్రత్యామ్నాయంగా ఆయిల్‌ఫామ్ సాగు చేయాలని సూచిస్తున్నాం. అంతేకాకుండా కూరగాయాలు, వేరుశనగ సాగు చేయాలని వివరిస్తున్నాం.

– పోలప్ప, వ్యవసాయ అధికారి, మాగనూర్

సమగ్ర శిక్ష అభియాన్ ఉద్యోగులకు మద్దతు



ధర్నాకు మద్దతు తెలుపుతున్న తపస్ నాయకులు

నారాయణపేట ఎడ్యుకేషన్: సమగ్ర శిక్ష ఉద్యోగులు ఏర్పరిచిన నిరవధిక సమ్మెకు తపస్ జిల్లా అధ్యక్షుడు శేర్ కృష్ణారెడ్డి ఆదివారం సంపూర్ణ మద్దతు ప్రకటించి మాట్లాడారు.. ఏళ్ల తరబడి వ్యవస్థలో వెట్టి చాకిరి చేయిస్తూ ఉద్యోగులను ఇబ్బంది పెట్టడం ప్రభుత్వానికి తగదని వారి సమస్యలను ప్రభుత్వం సానుకూలంగా పరిష్కరించాలని డిమాండ్ చేశారు. ర్యక్రమంలో తపస్ నాయకులు కిశోర్, సమగ్ర శిక్ష ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్ష కార్యదర్శులు ఎల్లా గౌడ్, అల్తాఫ హుస్సేన్, రాజు, ఉద్యోగులు పెద్దఎత్తున పాల్గొన్నారు.

ఘనంగా అయ్యప్పపూజ



నారాయణపేట: జిల్లా కేంద్రంలోని యాదగిరి రోడ్డు బైరంకొండరోడ్డులో శ్రీ ధర్మసస్తా అయ్యప్పస్వామి ఆలయంలో గురుస్వామి తిరుమలేష్‌గౌడ్ ఉమాపతి ఆధ్వర్యంలో అయ్యప్పస్వామి పడిపూజ వైభవంగా కొనసాగాయి. జిల్లా కేంద్రంలో పురవీధుల గుండా ఊరేగింపు నిర్వహించారు. అనంతరం అయ్యప్పస్వామి ఆలయంలో స్వామివారికి అభిషేకం, 18మెట్లపూజ నిర్వహించారు. అనంతరం భక్తులకు అన్నదానం నిర్వహించారు. గురుస్వాములు కాకర్ల భీమయ్య, కిశోర్‌గౌడ్, అప్పిస్వామి, రవిస్వామి, జంగిటి వెంకటేష్, బండి ఆనంద్, బాలరాజు, లింగుస్వామి పాల్గొన్నారు.

వైభవంగా బొడ్రాయి ప్రతిష్ఠాపనోత్సవాలు



బాపన్‌పల్లిలో ప్రతిష్ఠాపనోత్సవాల్లో పాల్గొన్న మహిళలు

దామరగిద్ద: మండలంలోని బాపన్‌పల్లిలో ఆదివారం బొడ్రాయి ప్రతిష్ఠాపనోత్సవాలు వైభవంగా నిర్వహించారు. గతరెండు రోజులుగా ప్రత్యేక పూజలు, హోమం, విగ్రహ ప్రాణప్రతిష్ట నిర్వహించారు. ఆడపడుచుల ఆరాధ్య దైవంగా భావించి చేపట్టి ప్రతిష్ఠాపనోత్సవాల్లో గ్రామ మహిళలు ఆడపడుచులు అధిక సంఖ్యలో పాల్గొని పూజలు చేశారు. గ్రామ దేవతలకు ప్రత్యేక పూజలు నవగ్రహ పూజలుచేసి తమ భక్తిని చాటుకున్నారు. అనంతరం అన్నదానం నిర్వహించారు. కార్యక్రమంలో గ్రామస్తులు ఉత్సవ కమిటీ నిర్వాహకులు పాల్గొన్నారు.

నేడు మహబూబ్ ఉస్సేని దర్గా ఉర్సు



అమరచింత: మండలంలోని ఈర్లదిన్నె గ్రామంలో సోమవారం మహబూబ్ హుస్సేని దర్గా షరీఫ్ ఉర్సోత్సవాలు నిర్వహిస్తున్నట్లు నిర్వహకుడు ఖతాల్ తెలిపారు. ప్రతి సంవత్సరం డిసెంబర్ నెలలో మహబూబ్ ఉస్సేని ఉర్సోత్సవాలు నిర్వహిస్తున్నట్లు ఆయన తెలిపారు. గ్రామంలోని ప్రతి ఒక్కరూ కలిసి మెలిసి దర్గా షరీఫ్‌లో ప్రార్థనలు చేసి కందూరు నిర్వహించడం అనాదిగా వస్తున్న ఆనవాయితిగా పేర్కొన్నారు.

సామూహిక సత్యనారాయణస్వామి వ్రతాలు



సత్యనారాయణస్వామి వ్రతాల్లో పాల్గొన్న భక్తులు

నర్వ: మండలంలోని లక్కర్‌దొడ్డిలో వేంకటేశ్వరస్వామి ఆలయంలో ఆదివారం సామూహిక సత్యనారాయణ స్వామి వ్రతాలను చేపట్టారు. ఈ సందర్భంగా స్వామివారికి పంచామృతాభిషేకాలు, తులసి దళాలతో అర్చన కార్యక్రమాలను నిర్వహించారు. అనంతరం 101జంటలచేత సామూహిక సత్యనారాయణస్వామి వ్రతాలను చేపట్టారు. ఆలయం ఆవరణలో ఏర్పాటుచేసిన ప్రత్యేక భజనలతో ఆలయ ప్రాంగణం మార్మోగిపోయింది. అనంతరం భక్తులకు అన్నప్రసాద వితరణ చేశారు. రాత్రికి అఖండ భజన కార్యక్రమాలు నిర్వహించారు. కార్యక్రమంలో అర్చకులు సిద్దయ్యస్వామి, గ్రామస్తులు శివన్న, మల్లేష్, పాపిరెడ్డి, మోనేషాచారి, గ్రామ పెద్దలు తదితరులు పాల్గొన్నారు.

భీమరాయుడి ధ్వజస్తంభం వద్ద పూజలు

అమరచింత: పట్టణంలోని రాంనగర్ కాలనీలో ప్రతిష్ఠించిన భీమరాయుడి ధ్వజస్తంభం వద్ద పౌర్ణమిని పురస్కరించుకుని ఆదివారం ప్రత్యేక పూజలు నిర్వహించినట్లు కాలనీవాసులు మాజీ వార్డ్ మెంబర్ శ్రీనివాసులు తెలిపారు. పూజల అనంతరం అన్నప్రసాద వితరణ కార్యక్రమం నిర్వహించారు.

పూర్వవిద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం



ఉపాధ్యాయులతో పూర్వ విద్యార్థులు

ఆత్మకూర్: పూర్వవిద్యార్థుల అపూర్వ సమ్మేళనం ఆదివారం ఆత్మకూర్‌లోని జాతర మైదానం బాలుర ఉన్నత పాఠశాలలో ఘనంగా నిర్వహించారు. 1996–97 పదో తరగతి పూర్తి చేసుకున్న పూర్వవిద్యార్థులు సమావేశమయ్యారు. ఈ సందర్భంగా పాఠాలు బోధించిన గురువులను సత్కరించారు. జగదీష్, శ్రీను, జహంగీర్, హరి, లక్ష్మీకాంత్, ఆసీఫ్, శేఖర్, రామకృష్ణ, నర్సింహ, ముజీబ్ ఉన్నారు.

హజ్‌యాత్ర అవకాశం రావడం అదృష్టం

స్టేషన్ మహబూబ్‌నగర్: హజ్‌యాత్ర చేయడానికి అవకాశం రావడం అదృష్టమని ప్రముఖ ధార్మికవేత్త మౌలానా తస్లీం అన్సారీ అన్నారు, జిల్లా హజ్ సొసైటీ ఆధ్వర్యంలో పట్టణంలోని జేజేఆర్ గార్డెన్స్‌లో సొసైటీ జిల్లా అధ్యక్షుడు మహమూద్‌అలీ అధ్యక్షతన ఆదివారం హజ్ యాత్రికులకు శిక్షణ శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా తస్లీం అన్సారీ హజ్‌యాత్రపై పలు సూచనలు, సలహాలు అందజేశారు. యాత్రికులు హజ్‌యాత్రపై సంపూర్ణ అవగాహన ఏర్పరుచుకోవాలని కోరారు. హజ్ యాత్రికులు ఇలాంటి శిక్షణ శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. జిల్లా హజ్ సొసైటీ అధ్యక్ష, కార్యదర్శులు మహెమూద్‌అలీ, మేరాజుద్దీన్, రవూఫ్‌పాష, సత్తార్, మహ్మద్ రఫీక్, ఖాజా నిజాముద్దీన్, మహ్మద్ ఫైజొద్దీన్, సయ్యద్ నిజాముద్దీన్, అహ్మద్ పటేల్, రజాక్, ఎండి.ఇలియాజ్, మూసా, సిరాజుద్దీన్, రఫీక్ ఉర్ రహెమాన్, ఎండి.అర్షద్‌అలీ, షేక్ గౌస్ పాల్గొన్నారు.

పిల్లర్లకే పరిమితమైన డైనింగ్‌హాల్



అసంపూర్తిగా ఉన్న డైనింగ్‌హాల్

అమరచింత: పట్టణంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాల ఆవరణంలో మన ఊరు–మనబడి ద్వారా గత ప్రభుత్వం డైనింగ్‌హాల్ కోసం నిధులు మంజూరు చేసినా, ఇప్పటి వరకు పనులు అసంపూర్తిగానే మిగిలాయి. గత ప్రభుత్వ హయాంలో పిల్లర్ల వరకు డైనింగ్‌హాల్ నిర్మాణం చేపట్టిన కాంట్రాక్టర్‌కు బిల్లులు చెల్లించకపోవడం, ఎన్నికల నోటిఫికేషన్ వెలువడటంతో డైనింగ్‌హాల్ నిర్మాణ పనులు మరుగున పడ్డాయి. ఎన్నికల అనంతరం కాంగ్రెస్ ప్రభుత్వం ఇందిరమ్మ ఆదర్శ పాఠశాలల పేరిట మరమ్మతులతో పాటు నిర్మాణం కోసం పాఠశాలలకు నిధులు మంజూరు చేసింది. కాని అసంపూర్తిగా ఉన్న డైనింగ్‌హాల్ నిర్మాణం కోసం నిధులు మంజూరు చేయలేదు. పాఠశాలలో సుమారు 380 మంది విద్యార్థులు మధ్యాహ్న భోజన సమయంలో ఆరుబయట నిలబడి భోజనం చేయాల్సిన దుస్థితి ఏర్పడింది. అధికారులు స్పందించి డైనింగ్‌హాల్ కోసం నిధులు మంజూరు చేయాలని పాఠశాల విద్యార్థులతో పాటు తల్లిదండ్రులు కోరుతున్నారు.

పిరమిడ్ ధ్యాన కేంద్రం ప్రారంభం



పిరమిడ్ కేంద్రం ప్రారంభోత్సవంలో పాల్గొన్న సభ్యులు

నారాయణపేట టౌన్: పట్టణంలోని శ్యాసన్‌పల్లి రోడ్డులో నూతనంగా నిర్మించిన పిరమిడ్ ధ్యాన కేంద్రాన్ని ఆదివారం ఘనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా ఉదయం పిరమిడ్ ట్రస్ట్ సభ్యులు పట్టణంలోని ప్రధాన రహదారుల గుండా శాఖాహార ర్యాలీని నిర్వహించారు. అనంతరం ముఖ్యఅతిథులుగా హాజరైన మున్సిపల్ చైర్మన్ గందె అనసూయతో కలిసి విశిష్ట అతిథులు పరిణిత పత్రి పిరమిడ్ ధ్యాన కేంద్రాన్ని ప్రారంభించారు. అనంతరం ఏర్పాటుచేసిన సమావేశంలో వారు మాట్లాడుతూ.. జీవితంలో ఎదురయ్యే అన్ని సమస్యల పరిష్కారానికి కావాల్సిన ఆత్మస్థైర్యం సంపాదించుకోవడం కోసం ధ్యానం ఎంతో ముఖ్యమన్నారు. ప్రతి మనిషి తనపై తాను నమ్మకం ఉంచుకొని, గురువులను నమ్ముకొని వారి బాటలో సాగాలన్నారు. పిరమిడ్ నిర్మాణానికి సహకరించిన వారిని సత్కరించారు. అనంతరం భక్తులకు తీర్థప్రసాదాలు పంపిణీచేశారు. కార్యక్రమంలో పీఎస్ఎస్ఎం ట్రస్ట్ చైర్మన్ విజయభాస్కర్ రెడ్డి, కూకట్‌పల్లి లక్ష్మి, దామోదర్‌రెడ్డి, సరిత తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా ఆంజనేయస్వామి బ్రహ్మోత్సవాలు



బిజ్వార్‌లో అలంకరణలో ఆంజనేయస్వామి మూలవిరాట్



నిడ్జింత ఆలయంలో పూజలు చేస్తున్న భక్తులు

ఊట్కూరు: మండలంలోని బిజ్వార్‌లో శ్రీ ఆంజనేయస్వామి స్వామి బ్రహ్మోత్సవాలు వైభవంగా కొనసాగుతున్నాయి. బ్రహ్మోత్సవాలలో భాగంగా ఆదివానం స్వామివారికి పంచామృతాభిషేకం, అలంకరణ, మహామంగళహారతి తదితర ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం బురుజు శ్రీనివాస్‌రెడ్డి భక్తులకు అన్నదానం చేపట్టారు. కార్యక్రమంలో ప్రధాన అర్చకులు నర్సింహ, జ్యోతి, రామచంద్రయ్య గౌడ్, కృష్ణయ్య, వేణుగోపాల్‌చారి, రవి కుమార్, తిమ్మారెడ్డి, మహేష్‌గౌడ్ పాల్గొన్నారు.

ఊరిబయటి అంజన్న రథోత్సవం

నర్వ: మండలంలోని భక్తులు ఊరిబయటి ఆంజనేయస్వామి రథోత్సవం వైభవంగా కొనసాగింది. ఈ సందర్భంగా ఉదయం ఆంజనేయస్వామి విగ్రహానికి పంచామృతాభిషేకాలు, పవమాన హోమాలు, ఆకుల పూజా కార్యక్రమాలను భక్తులు నిర్వహించారు. అనంతరం అర్చకులు భక్తులకు తీర్థ ప్రసాదాలు, అన్నప్రసాద వితరణ చేపట్టారు. సాయంత్రం ఆలయం నుంచి గ్రామ పురవీధుల గుండా స్వామివారి ఉత్సవమూర్తులను ఊరేగించారు. కార్యక్రమంలో గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

కొత్తపల్లి: మండల పరిధిలోని నిడ్జింత గ్రామశివారులో చెల్లంపల్లి ఆంజనేయస్వామి ఉత్సవాలు నిర్వహించారు. మూడురోజుల నుంచి అఖండ భజనలతో ఆదివారం స్వామివారికి జల్దిబిందె, పల్లకిసేవ, అభిషేకం నిర్వహించి భక్తులకు అన్నప్రసాదాలు చేశారు. ఈ ఉత్సవాలకు మండలంలోని పలుగ్రామాల నుంచి భక్తులు పాల్గొని మొక్కులు తీర్చుకున్నారు. కార్యక్రమంలో కోస్గి మార్కెట్ కమిటీ డైరెక్టర్ సూర్యప్రకాష్‌రెడ్డి, కోమటి రవి, రాజశేఖర్ రెడ్డి, విజయ్‌కుమార్, బసిరెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, డీలర్ పాండు తదితరులు పాల్గొన్నారు.



నర్వలో ఆంజనేయస్వామి రథాన్ని లాగుతున్న భక్తులు

రాజ్యాధికారం కోసం ఐక్యం కావాలి



శ్రీనివాస్‌యాదవ్‌ను సన్మానిస్తున్న నాయకులు

దామరగిద్ద: యాదవులు ఆర్థిక సామాజిక రంగాలతోపాటు రాజ్యాధికారం దిశగా ఎదిగేందుకు ఐక్యం కావాల్సిన అవసరం ఎంతైనా ఉందని తెలంగాణ రాష్ట్ర అఖిల భారత యాదవ మహాసభ రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడు రఘువీర్ యాదవ్ అన్నారు. ఆదివారం మండలంలోని క్యాతన్‌పల్లి వీరభద్రేశ్వర స్వామి ఆలయ ఆవరణలో సంఘం మండల నూతన కార్యవర్గ ఎన్నికలు నిర్వహించారు. ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. యాదవుల చరిత్ర ఎంతో గొప్పదన్నారు. గతంలో పార్లమెంట్‌లో 80 మంది సభ్యులు ఉండేవారని, నేటి రాజకీయ పార్టీలు యాదవులకు టికెట్లు ఇవ్వకపోవడంతో యాదవులు సంఖ్య తగ్గిందన్నారు. ప్రతి ఒక్కరూ విద్యావంతులై రాజ్యాధికారం దిశగా పోరాటం చేయాల్సిన అవసరం ఉందన్నారు. అనంతరం అఖిల భారత యాదవ సంఘం మండల అధ్యక్షుడిగా పిడుగు శ్రీనివాస్‌యాదవ్ ఎన్నికయ్యారు. ఉపాధ్యక్షుడిగా కె. నాగప్ప, గొల్ల ఆంజనేయులు యాదవ్, ప్రధాన కార్యదర్శిగా ఆవుల ఈరప్ప, సహాయ కార్యదర్శిగా భీంషప్ప యాదవ్, కొండ ఆశప్ప యాదవ్, సలహాదారుగా మాణిక్యప్ప యాదవ్ ఎన్నికయ్యారు. జిల్లా సదర్ కమిటీ అధ్యక్షుడు బాలప్పయాదవ్, తిరుపతి, బస్వరాజ్, గోపాల్, చిన్నయ్య యాదవులు పాల్గొన్నారు.

భగవద్గీత పఠనంతో జ్ఞానం పెంపు



త్రైతసిద్ధాంత ప్రబోధ ప్రచారం చేస్తున్న నిర్వాహకులు

ఆత్మకూర్: భగవద్గీత పఠనంతో జ్ఞానం వస్తుందని ఆచార్య ప్రబోధనంద యోగీశ్వరులు తెలిపారు. త్రైతసిద్ధాంత ప్రబోధ సేవాసమితి ఆధ్వర్యంలో ఆత్మకూర్ మండలంలోని మూలమల్ల గ్రామంలో భగవద్గీత ప్రచార ఊరేగింపు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆచార్య ప్రబోధనంద యోగీశ్వరుల సందేశాలను, భగవద్గీత శ్లోకాలను వినిపించారు త్రైతసిద్ధాంత భగవద్గీత, అనుబంధ గ్రాంథాలను పంచిపెట్టారు. కార్యక్రమంలో పెబ్బేరు, కొత్తకోట, మదిగట్ల ప్రబోధసేవాసమితి నిర్వాహకులు రాఘవేంద్రాచారి, రవి, యాది, మనోహర్, మంజుల, సబిత, సుదర్శన్, బాలరాజు, ఆంజనేయులు, ఉమారాణి, లావణ్య, స్వప్న, విజయభాస్కర్‌రెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, రామచంద్రయ్య పాల్గొన్నారు.

మాజీ సైనికుడి కుటుంబానికి ఆర్థిక సాయం



ఆర్థిక సాయం అందిస్తున్న మాజీ సైనికులు

కోయిల్‌కొండ: మండల కేంద్రంలోని ఉన్నతపాఠశాలలో చదువుకున్న కె. ప్రవీణ్‌కుమార్ ఆర్మీలో ఉద్యోగం పొంది దేశ సేవలో పాలుపంచుకొని పదవీ విరమణ అనంతరం ఇటీవల అనారోగ్యంతో మృతిచెందారు. తోటి ఆర్మీ యూనిట్ సహచరులు అయిన మాజీ సైనికులు ఆదివారం జిల్లాకేంద్రంలోని మృతుడి నివాసంలో దశదినకర్మ కార్యక్రమంలో పాల్గొని నివాళులర్పించి వారి కుటుంబానికి ఆర్థిక సాయంగా రూ. లక్షా 20వేలు అందించి వారికి భరోసా కల్పించారు. కార్యక్రమంలో మాజీసైనికులు వైవిరావు, కెఎస్‌రెడ్డి, ఆర్విరెడ్డి, మల్లేష్, హనుమంతు, మహబూబ్‌నగర్ మాజీసైనికుల అధ్యక్షులు వేణుగోపాల్‌రెడ్డి పాల్గొన్నారు.